


దర్శన సిఫార్సు లేఖల పునరుద్ధరణ



ప్రజాశక్తి-తిరుమల: తిరుమల శ్రీవారి దర్శనార్థం ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల సిఫార్సు లేఖల పునరుద్ధరణకు మాత్రమే తాత్కాలికంగా టీటీడీ నిర్ణయం తీసుకుంది. ఈనెల 15వ తేదీ నుండి సదరు నేతల సిఫార్సు లేఖలను మాత్రమే టీటీడీ అనుమతించనుంది. అయితే మిగిలిన వారి సిఫార్సు లేఖలపై అంతకు ముందు తీసుకున్న నిర్ణయం కొనసాగుతుంది. నియమావళి ప్రకారం అనుమతి పొందిన భక్తులకు ఈనెల 16వ తేదీ నుండి శ్రీవారి దర్శనం కల్పించనున్నారు.

వైభవంగా గంగమ్మ జాతర



- ఎటుచూసినా భక్తుల సందడి
- యథేచ్ఛగా కోళ్లు, పొటేళ్ల బలులు
- నేడు అమ్మవారి విశ్వరూప దర్శనం

తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ జాతర వైభవంగా వారం రోజుల పాటు జరిగింది. గత మంగళవారం 6న చాటింపుతో ప్రారంభమైన జాతర ప్రక్రియ బుధవారం తెల్లవారుజామున గంగమ్మ చెంప నరకడంతో ముగుస్తుంది.



అమ్మవారికి మాజీ మంత్రి రోజా సారె

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : వారం రోజులుగా వివిధ వేషాల్లో గంగమ్మను దర్శించుకున్న భక్తుల జోరు, మంగళవారం జాతర రోజు మరింత అట్టహాసంగా సాగింది. జాతరలో భాగంగా భక్తులు అమ్మవారికి బోనం, పట్టు వస్త్రాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పురుషులు కొంతమంది స్త్రీ వేషాలు వేసి తమ మొక్కులు చెల్లించుకున్నారు. నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అమ్మవారిని దర్శించుకుని, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలకుండా పర్యవేక్షించారు. జాతరలో కళాకారుల వేషధారణలు, ఊరేగింపులు, పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. గత ఏడాది వైసిపి హయాంలో తిరుపతి ఈ జాతరను రాష్ట్ర జాతరగా ప్రకటించారు. ఈ ఏడాదీ సంప్రదాయబద్ధంగా జాతర సాగింది. జాతర సందర్భంగా పొటేళ్ల, కోళ్ల క్రయ విక్రయాలు జోరుగా సాగాయి. పూజా సామాగ్రి అమ్ముకునేవారికి మంచి ధర పలికింది. చివరకు మల్లెపూలు సైతం భారీ ధరతో కొంతమేర చిరు వ్యాపారులకు లబ్ధి చేకూరింది. ఆటోల్లో భక్తులు వచ్చి వెళుతుండడంతో వారికి కొంతమేర ఈ వారం రోజుల పాటు వ్యాపారం జరిగింది. జాతర సందర్భంగా చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వారికి నిజంగానే 'జాతర'.

మంగళవారం తెల్లవారుజాము నుంచి గంగమ్మను ఆలయ అధికారులు, అర్చకులు అందంగా అలంకరించారు. అమ్మవారికి వజ్ర కిరీటం తొడిగారు. దీన్ని చూసేందుకు తిరుపతి నగర వాసులు తెల్లవారు జామున నాలుగు గంటల నుంచి క్యూలైన్లలో నిలబడ్డారు. ఆలయం వద్ద భారీ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. తిరుపతిలో ప్రభుత్వ కార్యాలయాలకు ఐచ్ఛిక సెలవు ఇచ్చారు. జాతర సందర్భంగా వ్యాపారస్తులు, రాజకీయ నాయకులు, అమ్మవారి భక్తులు అన్నదానంతో పాటు మజ్జిగ, అంబలి పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమంలో తిరుపతి టిడిపి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ ఆర్సి మునికష్ణ, ముద్ర నారాయణ, టిడిపి, జనసేన నేతలు, తిరుపతి ఎమ్మెల్యే ఆరనిణి శ్రీనివాసులు కుటుంబ సభ్యులతో అమ్మవారిని దర్శించుకున్నారు వారితో పాటు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, తిరుపతి అర్బన్ ఎస్పీ హర్షవర్ధన్ రాజు, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మౌర్య, పలువురు ఉద్యోగులు రాజకీయ నేతలు దర్శించుకున్నారు.

ఉత్సవ కమిటీ హడావిడి

తాతయ్య గుంట గంగమ్మ పాలకమండలిని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించకపోవడంతో ఉత్సవ కమిటీ పేరుతో 27 మందిని నియమించారు. వారు, వారి కుటుంబసభ్యులు, స్నేహితులు, బంధువులను ఆలయం వద్ద గుర్తింపు కార్డులు వేసుకుని దర్శనాలు కల్పించే విధంగా చేయడంతో సామాన్య భక్తులు ఇబ్బందులకు గురయ్యారు. ఆలయం వద్ద కొంతమంది భక్తులకు ఉత్సవ కమిటీ సభ్యులకు మధ్య స్వల్ప వాగ్వివాదం జరిగింది. పోలీసులు జోక్యం చేసుకొని వారిని శాంతింపచేశారు. కూటమి పార్టీ నేతలు ఎక్కువగా వారి బంధువులకు దర్శనానికి ప్రాధాన్యత ఇవ్వడం పట్ల సామాన్య భక్తులు పెదవి విరుస్తున్నారు.

నిఘా నీడలో జాతర

గంగమ్మ జాతర మంగళవారం కట్టుదిట్టమైన భద్రత మధ్య జరిగింది. ముఖ్యంగా అర్బన్ ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరవేక్షిస్తున్నారు. దీంతోపాటు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మౌర్య భక్తులకు క్యూలైన్లలో ఎలాంటి ఇబ్బంది రాకుండా సౌకర్యాలను ఏర్పాటు చేశారు.

భక్తులకు మజ్జిగ, అంబటి పంపిణీ

గంగమ్మ జాతర సందర్భంగా నగరంలో పలుచోట్ల భక్తులకు ఉచితంగా అంబిళ్ళతో పాటు చల్లని మజ్జిగ పంపిణీ చేశారు. పలు షాపుల యజమానులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, లైయన్స్ క్లబ్, చాంబర్ ఆఫ్ కామర్స్, క్రెడాయి వంటి సంస్థలు ముందుకు వచ్చి అన్నదానం నిర్వహించారు.

ట్రాఫిక్ మళ్లింపు

జాతర సందర్భంగా మంగళవారం పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించారు. తిరుమల బైపాస్ రోడ్డు నుంచి తుడా మీదుగా గంగమ్మ ఆలయానికి వెళ్లే వాహనాలను పోలీసులు బారికేడ్ల సాయంతో దారిని మళ్ళించారు. కేవలం ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు మాత్రమే అనుమతించారు. తిలక్ రోడ్డు మీదుగా ఇందిర ప్రియదర్శిని మార్కెట్‌కు వెళ్లే రహదారిని మూసివేశారు. హెడ్ పోస్ట్ ఆఫీస్ వీధి నుంచి గంగమ్మ ఆలయం వెళ్లే దారిలోనే అక్కడ కూడా బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఆలయానికి భక్తులు కేవలం నడుచుకొని రావడానికి మాత్రమే సౌకర్యం ఏర్పాటు చేశారు. కార్లు, ఆటోలు రాకుండా దారిని మళ్ళించారు.

నేడు విశ్వరూపం



విశ్వరూప ఏర్పాట్లు పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

తాతయ్య గుంట గంగమ్మ జాతరలో భాగంగా చివరి ఘట్టం బుధవారం విశ్వరూప దర్శనం కోసం వేలాదిమంది భక్తులు అర్ధరాత్రి నుంచే ఆలయానికి చేరుకున్నారు. ఇది కీలక ఘట్టంగా భక్తులు విశ్వసిస్తారు. కైకాల వంశస్తులు పేరంటాల వేషంలో గంగమ్మ చెంప నరకడం ద్వారా జాతర ముగుస్తుంది. ఈ సందర్భంగా గంగమ్మ చెంప నరికి మట్టిని భక్తులపైకి విసిరివేస్తారు. ఇదే మహాప్రసాదంగా భక్తులు స్వీకరించి ఇళ్లకు తీసుకెళుతుండటం జాతర ఆనవాయితీ.

పాలెగాళ్లపై పోరాటమే గంగ జాతర


నాటి గంగమ్మ పోరాట స్ఫూర్తితో నేటి పాలకవర్గాలపై ప్రజలు తిరుగుబాటు చేయాలి
: సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ



బలి ఇవ్వడానికి భక్తులు తీసుకొచ్చిన కోడిని సరదాగా పరిశీలిస్తున్న సిపిఐ జాతీయ నాయకులు నారాయణ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తరతరాలుగా పేదల అణిచివేతలో భాగంగా, పాలెగాళ్లకు వ్యతిరేకంగా సాగే పోరాటమే తిరుపతి గంగ జాతర అని సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ అభివర్ణించారు. ఏవైఎఫ్ జాతీయ మహాసభల ఏర్పాట్ల పర్యవేక్షణలో భాగంగా మంగళవారం తిరుపతికి వచ్చిన సందర్భంగా తిరుపతిలో జరుగుతున్న గంగ జాతరను, చిన గంగమ్మ గుడిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళుగా గంగమ్మ జాతర కులమతాలకతీతంగా జరుపుకునే పండుగన్నారు. పేదలంతా భక్తి భావాలతో చూస్తున్నారు, కానీ దీని చరిత్ర పాలకవర్గాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటంగా గంగ జాతరను చూడాలన్నారు. పేదవాళ్లందరూ స్వేచ్ఛ కావాలంటే వారికి ఉన్న కోపాన్ని తీర్చుకోవడానికి గంగ జాతర సందర్భంగా ఆడవాళ్లు మగ వేషాలు వేసుకుని, మగవాళ్లు ఆడవేషం వేసుకొని తిరుపతి వీధుల్లో వివిధ రకాల వేషధారణలతో బూతులు తిట్టుకుంటూ ఆనందాన్ని పొందేవారని తెలిపారు. ఈ జాతరలో లక్షలాదిమంది పాల్గొన్నప్పటికీ, వేషధారణలో ఉన్న వారు ఎన్ని బూతులు తిట్టినా మహిళలు గాని పురుషులు గాని కోపగించుకోకుండా సహజంగా దాన్ని తీసుకోవడం ఈ జాతర విశేషమన్నారు. 40 ఏళ్ల క్రితం ఆడవేషం వేసుకున్న ఒక వ్యక్తి తనను బండి మీద ఎక్కించుకొని, నోట్లో బీడీ వెలిగించుకొని పోతూ ఉంటే చాలా ఆనందంగా అనిపించదని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆ తర్వాత మళ్లీ ఈరోజు గంగమ్మ గుడికి రావడం, భక్తుల కోలాహల ఆనందాలను చూడడం సంతోషంగా ఉందన్నారు. గంగమ్మ జాతర ఆనాడు పాలేగాళ్లకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంగా చూస్తే నేడు పాలకవర్గాలపై ప్రజలంతా గంగమ్మ లాంటి కోపంతో తిరుగుబాటు చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు మోహన్ కుమార్ రాజు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, జిల్లా కార్యదర్శి మురళి, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, కే రాధాకృష్ణ, నగర కార్యదర్శి జే విశ్వనాథ్, తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ, వివిధ ప్రజా సంఘాల నాయకులు కే.పద్మనాభరెడ్డి, మహేంద్ర, అల్లా బక్షు, జనార్ధన్, రాము తదితరులు పాల్గొన్నారు.


రుద్రిమోహన్‌కు సాహితీ పురస్కారం



అత్తూరు రుద్రిమోహన్‌ను సత్కరిస్తున్న దృశ్యం (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: కవి, రచయిత రుద్రి మోహన్ జాతీయ తెలుగు భాషా సేవా సాహితి పురస్కారాన్ని అందుకున్నారు. ఏలూరులోని మహాలక్ష్మి కన్వెన్షన్ హాలులో అంతర్జాతీయ ఐఎస్ఒ గుర్తింపు పొందిన కళావేదిక వారు 48 గంటల పాటు నిర్విరామంగా నిర్వహించిన ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలు సందర్భంగా పుత్తూరుకు చెందిన పుత్తూరు రుద్రిమోహన్ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. సంస్థ సిఇఒ కళారత్న కత్తిమండ ప్రతాప్, జాతీయ కార్యదర్శి ఈశ్వరి భూషణం, జాతీయ కన్వీనర్ కొల్లి రమాపతి సంప్రదాయబద్ధంగా దుశ్శాలువా, తలపాగా, పూలదండ, జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని రుద్రి మోహన్‌కు అందజేశారు. కత్తిమండ ప్రతాప్ మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా భారతీయ జీవిత బీమా ఏజెంట్‌గా వేల కుటుంబాలకు ఆర్థిక రక్షణ కల్పిస్తూ, తనదైన శైలిలో సామాజిక సమైక్యతకు, కథలు, కవితలు రాస్తున్న అత్తూరు రుద్రిమోహన్ అభినందనీయులని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కవి సార్వభౌమ శ్రీనాధుడి మునిమనవడు పాల్గొన్నారు.

ప్రధానికి దైవబలం ఉండాలని ప్రార్థించా



తిరుత్తణి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

ప్రజాశక్తి - తిరుపతి సిటి: ఆపరేషన్ సింధూర్‌తో పాకిస్థాన్‌కు గుణపాఠం నేర్పిన సైనికులకు, దేశాన్ని ఏకతాటిపై నిలిపిన ప్రధానమంత్రి నరేంద్ర మోదికి తిరుత్తణి సుబ్రమణ్య స్వామి ఆశీస్సులు మెండుగా ఉండాలని ప్రార్థించినట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. దేశ నాయకత్వానికి దైవబలం చేకూరాలనే డిప్యూటీ సీఎం ఆకాంక్ష మేరకు తిరుత్తణి సుబ్రమణ్య స్వామి ఆలయంలో మంగళవారం ఆయన పూజలు నిర్వహించారు. పూజల అనంతరం మీడియాతో ఎమ్మెల్యే మాట్లాడుతూ షష్ఠ షణ్ముక ఆలయాల్లో జనసేన ప్రజాప్రతినిధులు మంగళవారం పూజలు నిర్వహించి ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు తాతినేని వెంకటేశ్వర రావు, ఎస్సీ కార్పోరేషన్ డైరక్టర్ యుగంధర్, వన్నెకుల క్షత్రియ కార్పోరేషన్ డైరక్టర్ బాలసుబ్రమణ్యం, కార్పోరేటర్లు నరసింహాచ్చారి తదితరులు పాల్గొన్నారు.

16న జాబ్ మేళా

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్, సీడాప్, డిఆర్‌ఏ సంయుక్తంగా పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 16 న జాబ్ మేళా నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డా.బి.చంద్రమౌళి మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ జాబ్ మేళాలో 15 బహుళ జాతీయ సంస్థలు పాల్గొనున్నాయని తెలిపారు. వివరాలకు రసూల్ 6300954441, కిషోర్ 6304330520 లను సంప్రదించాలని తెలిపారు.

సిబిఎస్ఈ ఫలితాల్లో
శ్రీసిటీ విద్యార్థుల విజయకేతనం

ప్రజాశక్తి - వరదయ్యపాలెం:

చిన్మయా స్కూల్ విద్యార్థుల ప్రతిభ

మంగళవారం వెలువడిన సిబిఎస్ఈ పరీక్షా ఫలితాల్లో శ్రీసిటీలోని చిన్మయా, అకార్డ్ విద్యాసంస్థలు వందశాతం ఉత్తీర్ణత సాధించాయి. చిన్మయా విద్యాలయ నుంచి పది పరీక్షలలో ఉత్తీర్ణత సాధించిన 57 మంది విద్యార్థులలో 16 మంది డిస్టింక్షన్, 29 మంది ఫస్ట్ క్లాస్, 12 మంది సెకండ్ క్లాస్ పొందారు. వీరిలో ఎస్.కవినాయ (93%), కె.జోష్నవి (88.8%), ప్రశాంత్ రాజ్ (87.2%) మార్కులతో టాపర్లుగా నిలిచారు. పన్నెండవ తరగతి పరీక్షలలో 18 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కాగా, ఆరుగురు డిస్టింక్షన్, మిగిలిన వారు ఫస్ట్ క్లాస్ మార్కులు సాధించారు. వీరిలో కె.లోకేష్, ఎ.లోకేష్ రెడ్డి, ఎస్.చరణ్ వరుసగా 93%, 83.4%, 82.4% మార్కులతో టాపర్లుగా నిలిచారు. చిన్మయా విద్యాలయకు సంబంధించి వరుసగా 9వ సారి పదవ తరగతి ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ కె.భువనేశ్వరి తెలిపారు. అలాగే పన్నెండు తరగతి పరీక్షలలో ఇది రెండవ బ్యాచ్ కాగా, ఇందులోనూ 100 శాతం ఫలితాలతో అద్భుతమైన ఫలితాలు పాఠశాలకు దక్కిందన్నారు.

అకార్డ్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

అకార్డ్ స్కూల్‌కు సంబంధించి వరుసగా రెండవ ఏడాది పదవ తరగతి పరీక్షల్లో 100% ఉత్తీర్ణత పొందారు. ఉత్తీర్ణులైన 29 మందిలో 11 మంది డిస్టింక్షన్, 9 మంది ఫస్ట్ క్లాస్, 6 మంది సెకండ్ క్లాస్, ముగ్గురు థర్డ్ క్లాస్ పొందారు. ఆర్.ఏ.ఆమేక 92.6%, కళాత్మిక తులసి 92.4%, తాతా లోహిత 89% మార్కులతో టాపర్లుగా నిలిచారని ప్రిన్సిపాల్ బృందా ప్రకటించారు. మంచి ఫలితాలు సాదించినందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన ప్రకటనలో అభినందనలు తెలిపారు.

తమిళ సినిమా 'డీడీ నెక్స్ట్ లెవెల్'పై ఫిర్యాదు

ప్రజాశక్తి - తిరుమల: తమిళ సినిమా డీడీ నెక్స్ట్ లెవెల్‌పై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ తిరుమల వన్ టౌన్ పోలీసులకు జనసేన పార్టీ తిరుపతి ఇన్ ఛార్జ్ కిరణ్ రాయల్ ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ సినిమాలో శ్రీనివాస గోవిందా పాటను భక్తుల మనో భావాలు దెబ్బ తీసేలా చిత్రీకరించిన సినిమా యూనిట్ పై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. తమిళనాడు ప్రభుత్వం హిందువుల మనోభావాలపై దాడి చేస్తున్నట్లు స్పష్టం అవుతోందన్నారు. సినిమాలో పాటను తొలగించాలని, లేదంటే సినిమా విడుదల కాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

కమీషన్ల కోసం కక్కుర్తి



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి :
శ్రీకాళహస్తీశ్వరాలయంలో పనిచేసే కొందరు సెక్యూరిటీ విభాగం ఉద్యోగులు ప్రయివేట్ అతిధిగృహాల్లో భక్తులకు రూములు ఇప్పిస్తూ, యాజమాన్యాల నుంచి కమీషన్లు తీసుకుంటు న్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీన్ని నిజం చేస్తూ సెక్యూరిటీ ఉద్యోగి ఆలయానికి వచ్చిన ఓ భక్తుడికి ప్రైవేటు లాడ్జిలో రూము ఇప్పించి యాజమాన్యం నుంచి కమీషన్ డిమాండ్ చేస్తున్న వీడియో మంగళవారం సామాజిక మాధ్యమాల్లో హల్ చల్ చేసింది. శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తులకు గైడ్‌గా వ్యవహరించాల్సిన సెక్యూరిటీ సిబ్బంది కమిషన్ల కోసం కక్కుర్తి పడటంతో విమర్శలు వస్తున్నాయి.

అన్నమయ్య సామాజిక కవి : ఆచార్య కె.సర్వోత్తమరావు

ప్రజాశక్తి - క్యాంపస్ : అన్నమయ్య సాహిత్యం విలక్షణమైందని, ఆయనను సామాజిక కవిగా, ఆలయ కవిగా, అనుభూతి కవిగా పేర్కొనవచ్చని ఎస్వీయూ విశ్రాంతాచార్యులు ఆచార్య కె.సర్వోత్తమరావు పేర్కొన్నారు. తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో జరుగుతున్న శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల 617వ జయంతి కార్యక్రమాలు మంగళవారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సాహితీ సదస్సులో ఆచార్య సర్వోత్తమరావు మాట్లాడుతూ "అన్నమయ్య పదాలలో గ్రామీణ చిత్రణ" అనే అంశంపై వివరించారు. అన్నమయ్య తన సంకీర్తనల్లో గ్రామీణ జీవితంలోని మాధుర్యాన్ని, జానపదాలను, గ్రామాల్లోని సామెతలను, నానుడులను పొందుపరిచారని తెలిపారు. సమాజ వికాసానికి అన్నమయ్య కీర్తనలు ఎంతో ఉపకరిస్తాయని చెప్పారు. తెలుగు కవులు ఎందరో అన్నమయ్య సాహిత్యం నుంచి స్ఫూర్తి పొందారన్నారు. తెలుగు, తమిళ, కన్నడ భాషా సాహిత్యాల్లో తగిన పరిజ్ఞానం కలిగి వైష్ణవ సంప్రదాయాలు తెలిస్తే గాని అన్నమయ్య సాహిత్యం అవగతం కాదన్నారు. అన్నమయ్య వంశీయులు హరిహరాయణాచార్యులు "శ్రీవారి ఆలయం అన్నమయ్య సేవా కైంకర్యాలు" అనే అంశంపై మాట్లాడుతూ బాల్యం నుంచి శ్రీవారి పట్ల భక్తిని వెల్లడించిన భక్తుడు అన్నమయ్య అన్నారు. శ్రీవారి ఆలయంలో కల్యాణోత్సవం తదితర సేవలను అన్నమయ్య ప్రవేశపెట్టారని చెప్పారు. దైవానికి తప్ప మరెవ్వరికీ తలవంచని ధైర్యం అన్నమయ్య సొంతమని, అన్నమయ్య వ్యక్తిత్వంలోని వివిధ ఉత్తమ కోణాలను వివరించారు. తిరుపతికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయులు డాక్టర్ బత్తెల శ్రీరాములు "అన్నమయ్య సంకీర్తనలు వైష్ణవాచార్యులు" అనే అంశంపై ప్రసంగించారు. అన్నమాచార్యులు మోక్ష సాధన సామగ్రిలో భక్తిని ఉత్తమోత్తమంగా భావించారని తెలిపారు. భక్తిని, శరణాగతిని ఆలంబనగా చేసుకుని ఆధ్యాత్మికంగా పురోగమించడమే కాకుండా, తమ ఆధ్యాత్మిక కీర్తనలతో లోకానికి తరుణోపాయం చాటి చెప్పారని అన్నారు. నవవిధ భక్తిమార్గాలు, గీతాచార్యుని ఉపదేశాలను ప్రమాణంగా చేసుకుని ఆధ్యాత్మిక యానం సాగించారని వివరించారు. సాయంత్రం 6 గంటల నుండి అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు బుల్లెమ్మ బృందం గాత్ర సంగీత కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం తిరుపతికి చెందిన పురుషోత్తం బృందం హరికథ గానం చేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ మేడసాని మోహన్, ప్రోగ్రాం అసిస్టెంట్ లత, ఇతర అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



అన్నమాచార్యుల 617వ జయంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న మేడసాని మోహన్ తదితరులు

హఫెల్ డిజైన్ స్టూడియో ప్రారంభం



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ఇంటీరియర్ సొల్యూషన్స్‌లో పేరుగాంచిన హఫెల్ తిరుపతిలో కొత్త ఫ్రాంచైజ్ షోరూమ్‌ను ఏర్పాటు చేసింది. తిరుపతి లోని ఉప్పరపల్లి మెయిన్ రోడ్డు వద్ద సియున్, డబ్ల్యూ డీఏ డిజైన్ స్టూడియోలో హఫెల్ షోరూమ్‌ను మంగళవారం హఫెల్ హెచ్ఆర్ అండ్ కస్టమర్ ఎక్స్‌పీరియన్స్ డైరెక్టర్ పద్మ గుప్తా, డబ్ల్యుడిఎ డిజైన్ స్టూడియో డైరెక్టర్లు వినోద్ అగర్వాల్, మహిమా అగర్వాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ షోరూం దక్షిణ భారతదేశంలో తన కార్యకలాపాలను విస్తరించేందుకు తోడ్పడుతుందన్నారు. డబ్ల్యూ డీఏ డిజైన్ స్టూడియో భాగస్వామ్యంతో ఈ షోరూమ్ ఏర్పాటు చేశామన్నారు. ఇది హఫెల్ ప్రీమియం ఇంటీరియర్ సొల్యూషన్స్ సమగ్ర శ్రేణిని అందిస్తుందన్నారు. హహెల్ ఇంటీరియర్ సొల్యూషన్స్ కోసం వన్ స్టాప్ గమ్యస్థానంగా రూపొందించబడిందన్నారు. కస్టమర్లు హఫెల్ పూర్తి స్థాయి వంటగది, వార్డ్‌రోబ్ హార్డ్‌వేర్, ఉపకరణాలు, ఉపరితల పరిష్కారాలు, లైటింగ్ పరిష్కారాలు, డిజిటల్ తాళాలతో సహా వాస్తవిక, భవిష్యత్, క్రియాత్మక సెట్టింగులలో ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని చెప్పారు. తిరుపతి పట్టణ అభివృద్ధి ఆధునిక, సమర్థవంతమైన అంతర్గత పరిష్కారాల కోసం పెరుగుతున్న డిమాండ్‌కి హఫెల్ షోరూమ్ అన్ని ఉపకరణాలు అందిస్తుందని చెప్పారు.

'వడదెబ్బ' తగలకుండా సూచనలు



డాక్టర్ రామ్‌నాయక్

ప్రజాశక్తి- కేవీబి పురం: ఉదయం 6 గంటల నుంచి 10 గంట ల్లోపు పనులన్నీ పూర్తి చేసుకోవాలని, ఎండబారిన పడకుండా సురక్షితంగా ఇళ్లల్లోనే ఉండాలని డాక్టర్ రామ్‌నాయక్ తెలిపారు. మండల కేంద్రంలో మంగళ వారం వడదెబ్బ తగలకుండా అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు తీసుకెళ్లాలని, వాటర్ బాటిల్ తప్పకుండా వెంట ఉండాలని సూచించారు. ఎవరికైనా వడదెబ్బ తగిలితే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, రైతులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు



లబ్దిదారులకు చెక్కులు అందిస్తున్న ఎంఎల్ఎ గాలి భానుప్రకాష్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: వడమాలపేట మండలం కాయం హెచ్‌డబ్ల్యు గ్రామానికి మంజూరైన సిఎం రిలీఫ్ చెక్కులను ఎంఎల్ఎ గాలి భానుప్రకాష్ అందజేశారు. జి.భాగ్యలక్ష్మి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. జి.భాగ్యలక్ష్మికి రూ.1,32,941, నారాయణరెడ్డికి రూ.74,670, పూడి గ్రామంలోని శ్రీరాం జానకిరామయ్యకు రూ.36,608, కదిరి మంగళం గ్రామం పూడి దామోదరానికి రూ.1,00,322లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు జానా వెంకటయ్య, ధనంజయనాయుడు, లక్ష్మీప్రసన్న, హైమావతి పాల్గొన్నారు.

వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిని కలిసిన టీడీపీ నాయకులు



వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న టీడీపీ నేతలు

ప్రజాశక్తి -కోట : నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సతీమణి, కోవూరు ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిని టీడీపీ నాయకులు నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి, మద్దాలి సర్వోత్తమ రెడ్డి, సన్నారెడ్డి ప్రసాద్ రెడ్డి లు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఇటీవల నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి వైసీపీకి గుడ్‌బై చెప్పి సత్యవేడులో ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్, మంత్రి నారా లోకేష్‌ల సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మద్దాలి సర్వోత్తమ రెడ్డి, సన్నారెడ్డి ప్రసాద్ రెడ్డి ఉన్నారు.

సంతాన సాఫల్యతపై అవగాహన



దంపతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : సంతాన సాఫల్యతపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో జరుగుతున్న వయాసిస్ జననీ యాత్ర గూడూరు పట్టణానికి చేరుకుంది. సంతాన సాఫల్యతపై పిల్లలు లేని తల్లిదండ్రులకు అవగాహన ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ క్యాంపును రోటరీ మాజీ డిస్ట్రిక్ గవర్నర్ కొణిదల మునిగిరీష్ ప్రారంభించారు. ఈ శిబిరంలో రాజేష్, శశిధర్, తిరుపతి బ్రాంచ్ సిబ్బంది పాల్గొన్నారు.

కంచి గరుడ మహోత్సవంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు



రథయాత్ర ముందు సేవలందిస్తున్న స్కౌట్స్ అండ్ గైడ్స్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : కరిమాణిక్య స్వామి ఆలయంలో కంచి గరుడ సేవ మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. భక్తుల రద్దీతో ఎటువంటి అవాఛనీయ ఘటనలు జరుగకుండా పుత్తూరు స్కౌట్ అండ్ గైడ్స్ సభ్యులు సేవలందించారు. ఈ కార్యక్రమంలో గైడ్ కెప్టెన్ లక్ష్మి, రేంజర్ లీడర్ యువశ్రీ, భూలోకేశ్వరి, ఓవియా ఇతర విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు అవగాహన



కూలీలకు వేసవి జాగ్రత్తలు వివరిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలం, కనమనందేడు పంచాయతీ, చెరువులో జరుగుతున్న ఉపాధి హామీలో పనులు చేస్తున్న కార్మికులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ విద్యాసాగర్, ఆరోగ్య అధికారి డిఎన్ వెంకటేశ్వర్లు వడ దెబ్బపై మంగళవారం అవగాహన కల్పించారు. ఉదయం 7 నుండి 10.30 లోపల పనులు ముగించుకోవాలని తెలిపారు. మంచినీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ వంటివి తాగుతూ ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం రత్నమ్మ, ఉపాధి హామీ సూపర్వైజర్, కూలీలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల్లో అవకతవకల ప్రక్షాళన జరిగేనా?




సామాజి తనిఖీలు నిర్వహించి జరిగిన అవకతవకలను పరిశీలిస్తున్న అధికారులు (దాచిన చిత్రం)

ప్రజాశక్తి -కోట : ఏప్రిల్ 15వ తేదీ, కోట మండల కార్యాలయం వద్ద మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీల సమావేశం నిర్వహించడం అందరికీ తెలిసిందే. ఈ కార్యక్రమానికి జిల్లా డ్వామా పిడి శ్రీనివాస ప్రసాద్, గూడూరు ఏపీడి వరప్రసాద్ రావులు హాజరయ్యారు. ఉపాధి హామీ పనుల తనిఖీల్లో అవకతవకలు బయపడినట్లు వారు మీడియాకు వెల్లడించారు. అవకతవకలు జరిగినట్లు నిర్ధారణ చేసుకుని కొంతమందికి పెనాల్టీతో పాటు, ఇద్దరు టెక్నికల్ అసిస్టెంట్లను సస్పెండ్ చేశారు. ఇవన్నీ సక్రమంగా జరగకపోవడానికి కారణం నీవే అని ఏపీవోను జిల్లా పిడి శ్రీనివాస ప్రసాద్ అందరి సమక్షంలో విమర్శించారు. ఇదే సందర్భంలో పలువురు ఉపాధి హామీ కూలీలు కోట ఏపీవో మాపై ఏకపక్ష వైఖరితో ప్రవర్తిస్తుందని పీడీకి ఫిర్యాదు చేశారు. స్పందించిన పీడీ శ్రీనివాస్ ప్రసాద్ కోట మండలంలో ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు జరిగిన విషయం వాస్తవమేనని, త్వరలో ప్రక్షాళన చేస్తానని బహిరంగంగా ప్రకటించారు.

కానీ 25 రోజులు గడిచినా మౌనంగా ఉండిపోయి, ఇప్పుడు హడావుడిగా మరలా గత ఏపీవోనే ఇక్కడే నియమించారు. ఆరోపణలు ఉన్న అధికారిణి వైపే పీడీ కూడా మొగ్గు చూపడం ఎంతవరకు సబబని ఉపాధి హామీ కూలీలు వాపోతున్నారు.

ఇప్పటికైనా ఉన్నతాధికారుల స్పందించి ఉపాధి హామీ పనుల్లో ఆరోపణలు తలెత్తకుండా మరో ఏపీఓను నియమించాలని కోరుతున్నారు.

పోక్సో చట్టం పై పిల్లలకు అవగాహన



భూపయ్య కాలనీ బాల, బాలికలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - నాయుడుపేట: నాయుడుపేట మున్సిపాలిటీ పరిధి, చెరువు కట్ట ముత్యాలమ్మ చెట్టు వద్ద భూపయ్య కాలనీ, సచివాల పరిధిలో ఐసిడిఎస్ సూపర్వైజర్, ఆశాల ఆధ్వర్యంలో మంగళవారం బాల, బాలికలకు ఆరోగ్య క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కిశోరి వికాసం కార్యక్రమంలో వారికి కొన్ని చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 15–18 సంవత్సరాల వయస్సు గల బాల, బాలికలకు పోక్సో యాక్ట్ 2012 ఏమిటీ, దాని చట్ట పరిధి, దాని పరిధిలో విధించే శిక్షల గురించి వివరించారు. అనంతరం ఆరోగ్య క్యాంపు నిర్వహించి పిల్లలలోని రక్త శాత పరీక్షలు నిర్వహించి రక్తం తక్కువ ఉన్నవాళ్లకు తగు జాగ్రత్తలు తెలియజేసారు. ఈ కార్యక్రమములో సూపర్‌వైజర్ ఆషా, ఏఎన్ఎం అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు, కిసోరి బాల బాలికలు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొత్త రైస్ కార్డుకు దరఖాస్తు చేయాలంటే..



వివరాలు వెల్లడిస్తున్న తహశీల్దారు సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి -పిచ్చాటూరు: పిచ్చాటూరు మండలం తాసిల్దార్ టీవీ సుబ్రహ్మణ్యం మంగళవారం జరిగిన విలేరుల సమావేశంలో మాట్లాడుతూ కొత్త రేషన్ కార్డులు దరఖాస్తు చేసుకోవాలనుకునే వారికి అర్హత, అవసరమైన డాక్యుమెంట్ల వివరాలు తెలియజేశారు. 1) కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.2 లక్షలకు లోపుగా ఉండాలి 2) ఆరు దశల ప్రమాణాలను కలిగి ఉండాలి 3) హౌస్ హెూల్డ్ డేటాబేస్‌లో నమోదు అయ్యి ఉండాలి. వారిలో ఎవరికి రైస్ కార్డ్ ఉండరాదు. కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులు జత చేయాలి. కొత్త సభ్యుడు చేర్చాలంటే వివాహం, జననం పత్రాలు జత చేయాలి. వీటికి వివాహ ధృవీకరణ పత్రం, వివాహ సమయంలో తీసిన దంపతుల ఫోటో జత చేయాలి. జననం ద్వారా అయితే జననం ధృవీకరణ పత్రం జత చేయాలి. అందరి ఆధార్ కార్డులు, ప్రస్తుత రైస్ కార్డు హోల్డర్ ఆధార్ కూడా జత చేయాలి. రైస్ కార్డ్ విభజనకోసం అనగా, ఒకే కార్డులో రెండు కుటుంబాలు ఉన్నప్పుడు, సంబంధిత సభ్యుల ఆధార్ కార్డులు, వివాహ ధృవీకరణ పత్రం, ప్రస్తుతం ఉన్న రైస్ కార్డ్, ఆధార్ కార్డులు జతచేయాలి. సభ్యుడిని తొలిగించాలంటే, సభ్యుడు మరణించినప్పుడు.. మరణ ధృవీకరణ పత్రం, ఆధార్, ప్రస్తుత రైస్ కార్డులు జత చేయాలి. చిరునామా మార్పుకోసం ఆధార్ కార్డ్‌లో కొత్త చిరునామా నమోదై ఉండాలి. ప్రస్తుం రైస్ కార్డు, ఆదార్‌లు జత చేయాలి. రైస్ కార్డ్‌లో సభ్యుడి ఆధార్ వివరాల మార్పుకు, సంబంధిత సభ్యుడి సరైన ఆధార్ కార్డు, ప్రస్తుతం ఉన్న రైస్ కార్డ్‌లు జతచేయాలని తెలిపారు.


రైస్ కార్డు లబ్ధిదారులకు ఈకేవైసీ చేయించండి



ఎంపీడీవో వెంకట రత్నమ్మ

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో రేషన్ కార్డుల ఈకేవైసీ కార్యక్రమానికి సహకరించాలని సూచించారు. ఈకేవైసీ చేసేందుకు పంచాయతీ కార్యదర్శి, మహిళ పోలీస్, విఆర్ఓలకు ప్రభుత్వం ఆప్షన్ ఇచ్చిందని తెలియజేశారు. వారి ముగ్గురిలో ఎవరో ఒకరు కచ్చితంగా సచివాలయంలో అందుబాటులో ఉండి, లబ్దిదారులతో రేషన్ కార్డు ఈకైవైసీ పూర్తిచేయించాలని ఆ ప్రకటనలో కోరారు.

నేత కార్మికుడు రాజేంద్ర మృతికి ఎమ్మెల్యే నివాళి



నేత కార్మికుడు రాజేంద్రకు నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే భాను ప్రకాష్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక గేట్ పుత్తూరు, పాత వీవర్స్ కాలనీకి చెందిన నేత కార్మికుడు రాజేంద్ర, మగ్గం మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై సోమవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ఆయన ఇంటికి వెళ్లి నివాళి అర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట టిడిపి ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్ ధనపాల్, మార్కెట్ కమిటీ చైర్మన్ డిఎస్ గణేష్, టిడిపి నాయకులు ఉన్నారు.

మారెమ్మకు అంబళ్లు

ప్రజాశక్తి - రేణిగుంట: మంగళవారం తిరుపతి గంగమ్మ జాతర పురస్కరించుకొని ఉదయం ఎలమండ్యం ఎస్సీ కాలనీ గ్రామాల్లో మారెమ్మకు అభిషేకం నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు చేసిన అంబిళ్లను అమ్మ వారి ముందు పెట్టి తర్వాత భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అందులో భాగంగా ఊరి పొలిమేర్లలో పొంగల్లు పెట్టి అమ్మవారిని అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ప్రతి ఏడాది తిరుపతి గంగమ్మ జాతర రోజున మారెమ్మకు పొంగల్లు పెట్టడం ఆనవాయితీగా వస్తుందన్నారు. మారెమ్మ తల్లి చల్లని దీవెనలతో వర్షాలు బాగా పడి పాడిపంటలతో పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో సుభిక్షంగా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు సన్మానం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: నూతన ఎంపీడీవోగా పదవి బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో వెంకటరత్నమును మంగళ వారం నెలవాయి ఎంపిటిసి మనోహర్ నాయుడు, టీడీపీ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా మనోహర్ నాయుడు మాట్లాడుతూ మండలంలో గిరిజనుల శాతం ఎక్కువగా ఉందని, వారి అభివృద్ధికి కృషి చేయాలని ఆమెను కోరారు. గిరిజనులకు భూములు, అటవీ హక్కులు, ఇతర సామాజిక హక్కులను కాపాడేందుకు కృషి చేయాలన్నారు. గిరిజన కాలనీలో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాటూరు రమణయ్య, తండా రమేష్, మునియా తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేతో భూ సమస్యల పరిష్కారం



భూముల రీ సర్వేలో పాల్గొన్న తహశీల్దారు జేజే రావు తదితరులు

ప్రజాశక్తి -కోట : రీ సర్వేతో రైతుల భూసమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తహశీసిల్దార్ కే.జేజే.రావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం కోట మండలం ఇల్లకూరుపాడు వద్ద రీ సర్వేలో భాగంగా క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహించారు. ఈ భూ సర్వేలో రైతులకు పలు సందేహాలను వ్యక్తం చేశారు. సర్వే టీం సభ్యులు పరిశీలించి తగు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ గోపిరెడ్డి, విఆర్ఓ శ్రీనివాసులు, సర్వేయర్ మహేష్, సౌమ్య, రైతులు పాల్గొన్నారు.

బాలసదనంలో ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి, బాలసదనంలో పొరుగు సేవల ప్రాతిపదికన ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు బాలసదనం సూపరింటెండెంట్ పి.హరిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖాళీల వివరాలు ఇలా ఉన్నాయి. అవుట్సోర్సింగ్, పార్ట్ టైం ప్రతిపాదికన ఖాళీగా ఉన్న కుక్, నైట్ వాచ్మెన్, హౌస్ కీపర్, ఎడ్యుకేటర్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్, పీటీ ఇన్స్ట్రక్టర్ కం యోగా టీచర్ పోస్టులకు అర్హత కలిగిన మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. వివరాలు https://tirupati. ap.gov.in వెబ్ సైట్‌లో పొందాలని తెలిపారు. సందేహాలుంటే 9000106774 నంబరును సంప్రదించాలని కోరారు.


పాకాల సత్యమ్మ ఆలయంలో వైభవంగా జాతర



సత్యమ్మ ఆలయంలో మొక్కులు చెల్లించుకుంటున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

ప్రజాశక్తి -రామచంద్రపురం (పాకాల) తిరుపతి జిల్లా, చంద్రగిరి నియోజకవర్గం, పాకాలలో గంగ జాతర వైభవంగా జరిగింది. పాకాల గ్రామ దేవత అయిన సత్యమ్మ తల్లికి మంగళవారం గంగ జాతర సందర్భంగా చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని) పట్టు వస్త్రాలు సమర్పించారు. జాతర ఉత్సవ కమిటీ, అర్చకులు ఎమ్మెల్యేను సన్మానించి, ఆశీర్వదించి, అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండేలా అమ్మ వారు ఆశీస్సులు ఇవ్వాలని మొక్కుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, జాతర ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజలు మహిళలు పాల్గొన్నారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన సత్యవేడు పరిశీలకులు



నారా లోకేష్‌తో చంద్రశేఖర్ నాయుడు

ప్రజాశక్తి - సత్యవేడు: తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు చంద్రశేఖర్ నాయుడు మంగళవారం అమరావతి క్యాంపు కార్యాలయంలో తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి, ఐటీ మంత్రి నారా లోకేష్‌ను కలిశారు. సత్యవేడు నియోజకవర్గ అభివృద్ధి అంశాలపై చర్చించి, కమిటీల ఏర్పాటుపై సలహాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్, సత్యవేడు అభివృద్ధిపై నాయకులు దృష్టి సారించాలని సూచించారని తెలిపారు. కమిటీల ఏర్పాటు విషయంలో అందరని కలుపుకుని పోవాలని, కార్యకర్తలకు సముచిత స్థానం కల్పించాలని మంత్రి సూచన చేసినట్లు చంద్రశేఖర్ నాయుడు తెలిపారు.

క్రైం న్యూస్

చిన్నారిపై అసభ్యప్రవర్తన



నిందితుడు మస్తాన్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు మండలం, చెన్నూరు గ్రామంలో నాలుగేళ్ల చిన్నారిపై ఓ వృద్ధుడు అసభ్యకరంగా ప్రవర్తించడంతో స్థానికులు అతడికి దేహశుద్ధి చేసిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు... చెన్నూరు గ్రామంలో 50 ఏళ్ల మస్తాన్ అనే వృద్ధుడు నివాసం ఉంటున్నాడు. మంగళవారం అదే ప్రాంతానికి చెందిన నాలుగేళ్ల చిన్నారి ఆటలాడుతండగా గమనించిన వృద్ధుడు ఆ చిన్నారితో అసభ్యకరంగా ప్రవరిస్తుండడంతో చిన్నారి కేకలు వేసింది. దీనిని గమనించిన స్థానికులు అతడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. దీంతో అతను అక్కడి నుంచి పరారయ్యాడు.


వ్యక్తి ఆత్మహత్య



మృతి చెందిన సుబ్బారావు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు రెండో పట్టణ పరిధి, టిడ్కోగృహాలలో మంగళవారం ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చోటుచేసుకుంది. రూరల్ పోలీసుల కథనం మేరకు స్థానిక గాంధీనగర్ సమీపంలోని టిడ్కో గృహాలలో సుబ్బారావు(43) అనే వ్యక్తి నివాసం ఉంటున్నాడు. నెల్లూరులోని కరెంట్ ఆఫీస్‌లో సబార్డినేట్‌గా విధులు నిర్వహిస్తుంటాడు. కుటుంబకలహాల నేపథ్యంలో మనస్థాపానికి గురైన సుబ్బారావు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిని గమనించిన కుటుంసభ్యులు రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు సుబ్బారావుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసకుని దర్యాప్తు చేస్తున్నారు.

19 నుండి శ్రీ వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు



ప్రజాశక్తి-తిరుపతి : కార్వేటినగరం శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు 19 నుండి 27వ తేదీ వరకు వైభవంగా జరుగనున్నాయి. 18వ తేదీ సాయంత్రం అంకురార్పణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం 7.30 నుండి 11 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. జరిగింది. ఈ కార్యక్రమంలో టెంపుల్ ఇన్స్పెక్టర్ శ్రీ సురేష్ కుమార్, ఆలయ అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.లడ్డూ, ఒక అప్పం బహుమానంగా అందజేస్తారు.

పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న ప్రేమ్‌కుమార్, ప్రసన్న దంపతులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు మండలం, పోటుపాలెం, చలివేంద్ర గుంట ఎస్టీ కాలనీలోవాసులు 70 మంది నిరుపేదలకు మంగళవారం యంగల ప్రేమ్ కుమార్, ప్రసన్న దంపతుల కుమార్తె యంగల ప్రణయ జన్మదిన సందర్భంగా కృప సేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దాతలుగా చిన్నారి తాత కసుకుర్తి కోటేశ్వరరావు, అమ్మమ్మ భారతి దంపతులు వ్యవహరించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు కటకం శ్రీనివాసులు మాట్లాడుతూ గిరిజన కుటుంబాలకు అన్నదానం అనేది వారి అవసరాలను తీర్చడానికి సహాయపడే ఒక మంచి కార్యక్రమన్నారు. దాతలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అత్తి మంజరి గోపాలు, పర్వతల రమేష్, పేయ్యల రమణయ్య, చవల సురేంద్ర బాబు, ఈగ వాసు, శివ, కొండూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.